
www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 3 మే 2025 | 5 | కాకినాడ



ఉత్సాహంగా వేసవి క్రీడా శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహారాణి కళాశాలలో వేసవి శిక్షణా శిబిరం ఉత్సాహపూరితంగా సాగుతోందని జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. శిబిరంలో రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, త్రోయింగ్‌లో శిక్షణ ఇచ్చారన్నారు. ఈ శిక్షణలో క్రీడాకారులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారన్నారు. రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్‌కు సంబంధించి 26 ఈవెంట్లలో శిక్షణ ఇస్తున్నారన్నారు. శిబిరంలో ఆదిత్య యూనివర్సిటీ వ్యాయామ ఉపాధ్యాయుడు బళ్ల అఖిల్ గౌతమ్, కె.కొండలరావు, ప్రసాద్ రెడ్డి, వీరబాబు, రమణ పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- పూర్తి కాని భవనాల పనులు
- వేధిస్తున్న నిధుల కొరత
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ వర్కర్లకు భారంగా మారింది. ప్రభుత్వం ఇచ్చే బిల్లులు అరకొరగా ఉండడం, అవీ సకాలంలో మంజూరు చేయకపోవడం తదితర కారణాల వల అద్దె భవనాల్లో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. పైగా యజమానుల ఒత్తిళ్ళ నడుమ అంగన్వాడీలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణం చేపట్టినా అవి ఏళ్ళు తరబడి పూర్తి కావడం లేదు. ప్రభుత్వం నిధుల విడుదల చేయడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. దీంతో స్త్రీ-శిశు సంక్షేమ శాఖ లక్ష్యాలకు తూట్లు పడుతున్నాయి.

కాకినాడ జిల్లాలో 10 ప్రాజెక్టుల పరిధిలో 1986 మెయిన్, మిని అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 70 శాతం సొంత భవనాలుండగా మిగిలినవి అద్దె భవనల్లో కొనసాగుతున్నాయి. అన్ని కేంద్రాల్లోనూ 1.38 లక్షల మంది పిల్లలు ఉన్నారు. 11,518 మంది బాలింతలు, 13,134 మంది గర్భవతులు ఉన్నారు. జిల్లాలో 1986 కేంద్రాల్లో 706 సొంత కేంద్రాలు ఉండగా 1107 అద్దె భవనాల్లో, రెంట్ ఫ్రీలో 173 నడుస్తున్నాయి.

కూటమి నిర్లక్ష్యం

చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడి కేంద్రాలు చాలా కీలకంగా వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సక్రమంగా ఐసిడిఎస్ సేవలను అందించేలా ప్రభుత్వం పగడ్బందీగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. గత వైసిపి పాలనపై తీవ్ర విమర్శలు చేసిన కూటమి పెద్దలు ఐసిడిఎస్ సేవలను మెరుగు పరచడంలో మాత్రం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. వాస్తవానికి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సేవలు చాలా కీలకమైనవి. ఇందుకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సి ఉంది. కానీ సర్కారు మాత్రం ఐసిడిఎస్‌పై చిన్నచూపు చూస్తోంది.

మూడేళ్లు కావస్తున్నా అరకొర పనులే

జిల్లాలో ఉన్న కేంద్రాల్లో కొన్ని సొంత భవనాల్లోనే నిర్వహిస్తుండగా ఇంకొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పలుచోట్ల భవనాలు శిథిలావస్థకు చేరి ఉన్నాయి. దీంతో లబ్ధిదారులు, సిబ్బంది భయం భయంగా గడపాల్సి వసోతంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం నూతన భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినా పనులపై శ్రద్ధ చూపలేకపోయింది. గత ప్రభుత్వం నాడు-నేడు రెండో విడతలో భాగంగా 2022 జూలై 26న 98 అంగన్వాడీ నూతన భవనాలను మంజూరు చేసింది. ఒక్కోదానికి రూ.13.5 లక్షలు, ఫర్నీచర్ కోసం రూ 2.5 లక్షలు కేటాయించారు. మూడేళ్లు కావస్తున్నా నిర్మాణాల్లో పురోగతి కనిపించడం లేదు. పంచాయతీరాజ్, సమగ్రశిక్షాభియాన్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వీటిలో గత ప్రభుత్వ హయాంలో ఒక్కటి కూడా పూర్తి కాలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు-నేడును బదులు మనబడి-మన భవిష్యత్తుగా, పేరును మార్చి అమలు చేస్తోంది. ఇప్పటివరకు తుని మండలంలో వెలమ కొత్తూరు, గాంధీ నగర్, శంఖవరం మండలంలోని శంఖవరం, వి.వెంకటాపురం, పెద్దాపురం మండలంలోని మర్లావ, కట్టమూరులలో రెండు మొత్తంగా సుమారు 10 చోట్ల మాత్రమే పూర్తయ్యాయి. జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం, తాళ్లరేవు, తుని తదితర మండలాల్లో కొన్ని చోట్ల స్లాబులు పడ్డాయి. ఇవే మండలాల్లో అనేక చోట్ల భవనాలు ఇంకా పునాదుల దశలోనే నిలిచిపోయాయి. అనేక చోట్ల పైకప్పు స్థాయి వరకు ఇటుక పని పూర్తి చేసి వదిలేశారు. కిర్లంపూడి మండలంలో రెండు చోట్ల కోర్టు కేసుల వల్ల పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా అరకొర పనుల నడుమ అనేక ప్రాంతాల్లో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది జూన్ నాటికే అన్ని భవన నిర్మాణ పనులూ పూర్తి కావాల్సి ఉంది. పలుచోట్ల పనులు మధ్యలోనే ఉండిపోవడంతో ఐసిడిఎస్ సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. బిల్లుల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ఈ పనులు ముందుకు సాగడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో భవనానికి రూ.13.5 లక్షలు కేటాయించగా కేవలం 50 శాతం మాత్రమే ఇప్పటి వరకు బిల్లులు మంజూరు చేశారు. దీంతో పనులు నిలిపివేశామని నిర్మాణదారులు చెబుతున్నారు.


పిఠాపురం మండలంలో నిర్మాణ దశలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ, పెద్దాపురం

ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపు ఇచ్చారు. కచేరిపేట సిఐటియు కార్యాలయంలో ఎఐసిసిటియు రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యన్నారాయణ అధ్యక్షతన శుక్రవారం కేంద్ర కార్మిక సంఘాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు తాళ్లూరి రాజు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కరోనా సమయంలో చర్చ లేకుండా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల అమలును అడ్డుకునేందుకు భారత దేశంలోని యావత్ కార్మికవర్గం మే 20న సమ్మెకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. 13 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ సార్వత్రిక సమ్మె చేనపట్టినట్టు తెలిపారు. కార్మిక చట్టాలు బలంగా ఉన్నప్పుడు కూడా కార్మికులకు చట్టాలు అరకొరగా మాత్రమే అమలు జరిగేవని, ఇప్పుడు 44 కార్మిక చట్టాలను రద్దు చేసిన తర్వాత భారతీయ కార్మికులు బానిసల కంటే దారుణమైన పరిస్థితుల్లోకి నెట్టబడతారని హెచ్చరించారు. హైర్ అండ్ ఫైర్, ఫిక్సిడ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్, అప్రెంటీస్ విధానాల ద్వారా కార్మికుల శ్రమను కార్పొరేట్ యాజమాన్యాలకు దోచి పెట్టేందుకే మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చిందని గుర్తు చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే యాజమాన్యాలపై విధించే శిక్షలను తొలగించి, రాజ్యాంగబద్ధంగా పోరాడే కార్మికులపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా చట్టాలను మార్పులు చేయడాన్ని కార్పొరేట్ పెట్టుబడిదారుల లాభల కోసమేనని విమర్శించారు. పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభాన్ని సామాన్య ప్రజలపై, కార్మికులపై బలవంతంగా రుద్దేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను మే 20 సమ్మెలో కార్మికులు సంఘాలతో నిమిత్తం లేకుండా భారీగా పాల్గొనడం ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మే 3 నుండి 5వ తేదీ లోపు యాజమాన్యాలకు, అధికారులకు సమ్మె నోటీసులు అందించాలని, మే 7వ తేదీన జిల్లా విస్తత సమ్మె సదస్సులు నిర్వహించాలని, మే 12 లోపు అన్ని మండలాల్లో సదస్సులను పూర్తిచేయాలని, కరపత్రాలు ద్వారా, పోస్టర్ల ద్వారా సమ్మె డిమాండ్లపై కార్మికుల్లో ప్రచారం నిర్వహించాలని కార్యాచరణ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఐఎన్‌టియుసి నాయకులు వివి.రమణ, సాయి పాల్గొన్నారు.


కాకినాడ సమావేశంలో మాట్లాడుతున్న సత్యన్నారాయణ

పెద్దాపురం సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి పిలుపు తీచ్చారు. మే డే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డు ఆంజనేయస్వామి గుడి సెంటర్లో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి దేశ ప్రజల ప్రయోజనాలు విస్మరించి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ వారి ఆస్తులు పెంచేందుకు పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఒకదాని తర్వాత ఒకటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారన్నారు. నంతరం ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలో బంగారు రాజు, అమత, నమ్రత, పూజిత, చింతపల్లి వీరబాబు, రొంగల అరుణ్, సూర్యకళ, నియాజ్ హాసిని, సిమ్ము, సూర్య, అఖిల, నిఖిల, రొంగల వీర్రాజు, దారపరెడ్డి కృష్ణ, సత్యనారాయణ, ఎం.రాంబాబు పాల్గొన్నారు.



పెద్దాపురం సమావేశంలో మాట్లాడుతున్న బేబీరాణి

ఎపిఇఎపి సెట్ దరఖాస్తుకు గడువు పెంపు

ప్రజాశక్తి-కాకినాడ

ఎపిఇఎపి సెట్-2025కు దరఖాస్తు చేసుకునేందుకు రూ.10 వేల ఫైన్‌తో ఈ నెల 16 వరకూ గడువు పొడిగించినట్టు సెట్ ఛైర్మన్, జెఎన్‌టియుకె విసి ప్రొఫెసర్ సిఎస్ఆర్‌కె.ప్రసాద్ తెలిపారు. ఈ నెల 1వ తేదీకి గడువు ముగిసిందన్నారు. ప్రవేశ పరీక్షకు గురువారం వరకు 3,60,119 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. పరీక్షకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థులు రూ.2000 అపరాధ రుసుంతో మే 7వ తేదీ వరకూ, రూ.4 వేల ఫైన్‌తో మే 12, రూ.10 వేల ఫైన్‌తో మే 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 46, హైదరాబాద్‌లోని రెండు రీజనల్ సెంటర్లు మొత్తం 48 రీజనల్ సెంటర్లలో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తుల్లో తప్పులు ఉంటే ఆన్‌లైన్‌లో మార్పు చేసేకునేందుకు మే 8వ తేదీ వరకు విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని ఆయన తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను మే 12వ తేదీ నుంచి సంబంధిత వెబ్‌సైట్‌తోపాటు, ప్రభుత్వం ప్రారంభించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. విద్యార్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా 0884-2359599, 0884-2342499 ఫోన్ నెంబర్లు, helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడి ద్వారా గాని సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.


సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న దువ్వా శేషబాబ్జి

సిహెచ్‌ఒల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాకినాడ

నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న సిహెచ్‌ఒల సమ్మెకు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ మద్దతు తెలిపారు. కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారి సంఘాల ప్రతినిధులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎంలోని క్యాడర్లకు ఎంటిఎస్ అమలు చెయ్యకుండా వివక్ష చూపుతోందని, 2022 వరకూ రాష్ట్ర ప్రభుత్వ శాఖలలోని కాంట్రాక్ట్ ఉద్యోగులతో సమానంగా ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని క్యాడర్లకు ఎంటిఎస్ ఇచ్చేవారని, గత 15 ఏళ్లుగా అమలైన ఈ విధానానికి గత ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. దీని వల్ల ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని క్యాడర్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం హ్యూమన్ రిసోర్స్ పాలసీ అమలు చెయ్యాలని, ఎంఎల్‌హెచ్‌పిలు వేతన పెంపు, హెచ్ఆర్ పాలసీ, ఇన్‌సెంటివ్ బకాయిల చెల్లింపు తదితర డిమాండ్ల పరిష్కారానికి సమ్మె నిర్వహిస్తున్నారన్నారు.

పలుచోట్ల ఘనంగా మేడే దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక సంత చెరువు ప్రాంతంలోని సినిమా రోడ్డులో సిఐటియు సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ అధ్యక్షతన గురువారం రాత్రి మేడే బహిరంగ సభ నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ వర్మ మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజానీకంపై పన్నులు భారం వేసి సంపన్నులకు మాత్రం వరాల జల్లు కురిపిస్తోందన్నారు. మోడీ ప్రభుత్వంలో కార్మికుల పరిస్థితులు దుర్భరంగా తయారయ్యాయని అన్నారు. ఏళ్ల తరబడి కనీస వేతనాలు చెల్లించాలని, రెగ్యులరైజేషన్ చేయాలని ఎన్నో పోరాటాలు చేస్తున్న ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. ఈ నెల 20న లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, కర్రి నాగేశ్వరరావు, కృష్ణ, విజయ్ కుమార్, రమణమ్మ, జ్యోతి, సిహెచ్.వేణి, ఎం.నాగలక్ష్మి, రాణి, ప్రకాష్, కుమార్ స్వామి, రాజేంద్రప్రసాద్, హరినాథ్, విజయ్ కుమార్, బాబ్జి, అర్జున్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ సిఐటియు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా వలసపాకల సెంటర్లో బహిరంగ సభలో వక్తలు మాట్లాడారు. రూరల్ మండల కార్యదర్శి టి.రాజా అధ్యక్షత వహించారు. తొలుత ప్రజానాట్యమండలి కళాకారులు డప్పులు దరువులతో, అభ్యుదయ గీతాలు పాడారు. పుచ్చలపల్లి సుందరయ్య జయంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సిఐటియు సీనియర్ నాయకులు చింతపల్లి అజయ్ కుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ, మాట్లాడారు. సిఐటియు నాయకులు వాసంశెట్టి చంద్రరావు, సిహెచ్.విజయ్‌కుమార్, అంబటి రామకృష్ణ, ఆత్మూరి కృష్ణాజీరావు, అంగాడి శ్రీను, పంతాడి నూకరాజు, దుర్గాప్రసాద్, సింహాద్రి, గోవింద్, సాల్మన్ రాజ్, సంగీతరావు, శివ, లచ్చన్న, ధనరాజు, కామేశ్వరరావు, సాయి, కృష్ణ, రాజు, దుర్గారావు, నాగేశ్వరరావు, శివరాజు, రామకష్ణ, సురేష్, నూకరాజు పాల్గొన్నారు.

తాళ్లరేవులో మేడే ఘనంగా నిర్వహించారు. సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం నుంచి తాళ్లరేవు ప్రభుత్వాసుపత్రి వరకూ భారీ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, నాయకులు దుప్పి అదృష్టదీపుడు, బీర సత్తిబాబు, విఒఎల సంఘం నాయకులు కె.రత్నకుమారి, ఎన్.మంగామణి, కె.ఈశ్వరీబాయి, డి.గోవిందమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్.నాగలక్ష్మి, పి.అనంతలక్ష్మి, జి.శ్రీదేవి, ఎం.వెంకటలక్ష్మి, ఎ.బాబూరావు, కె.ప్రకాష్‌రావు, కె.వెంకటరమణ, కుసుమ శ్రీనివాస్, వడ్డి ఏడుకొండలు, జి.మల్లేశ్వరరావు, పి.శ్రీనివాస్, పి.గోపాలకృష్ణ, డి.వెంకటరమణ, రెడ్డి రవి, బాలరాజు పాల్గొన్నారు.



కాకినాడ సభలో మాట్లాడుతున్న దువ్వా శేషబాబ్జి



తాళ్లరేవులో ప్రదర్శనలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

ప్రజాశక్తి -తాళ్లరేవు

చిల్డ్రన్స్ క్లబ్ తాళ్లరేవు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. క్యాంపులో విజ్ఞానం, వినోదం, వికాసం పేరుతో నిర్వహించిన పలు కార్యక్రమాలను ఎంపి రాయుడు సునీత గంగాధర్, జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఎఎంసి మాజీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ప్రారంభించారు. చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధి గుత్తుల మల్లేశ్వరరావు కార్యక్రమాలను వివరించారు. కాశి రవీంద్ర, బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి, వాసంశెట్టి శ్రీనివాస్, గంజా సూరిబాబు, వాసంశెట్టి నందివర్ధన, మురళీధర్, తాతారావు, పంతగడ సూర్యనారాయణ, ఉంగరాల వెంకటేశ్వరరావు, కన్నీడి వెంకటరమణ, తణుకు రాంబాబు, ఈశ్వరీబాయి, నాని, శ్రీనివాస్, కృష్ణ, ఆనంద్ పాల్గొన్నారు.


సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న చిన్నారులు

సోలార్ యూనిట్లను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-కాకినాడ


పిఎం సూర్య ఘర్ పథకంపై మండల, గ్రామ స్థాయిలో విస్తత అవగాహన కల్పించి అత్యంత ప్రయోజన దాయకమైన రూఫ్ టాప్ సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని జెడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధికారులకు సూచించారు. శుక్రవారం జెడ్‌పి సమావేశ మందిరంలో స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని ఆయా అంశాల స్థాయీ సంఘాలు సమీక్షించి, మరింత పటిష్ఠ, సత్వర అమలుకు అధికారులకు సూచనలు చేశాయి. ఆర్థిక, ప్రణాళిక అంశంపై చర్చలో గ్రామ పంచాయితీలకు రావాల్సిన స్టాంపుడ్యూటీ, సీనరేజి సర్దుబాటు చెల్లింపులను వెంటనే జరపాలని, పంచాయితీల పరిధిలో జరిగే అన్ని పనులకు తప్పని సరిగా పంచాయితీ తీర్మానాలతోనే నిర్వహించాలని సంఘాల సభ్యులు కోరారు. ఇప్పటికే చేసిన పనులకు సత్వరం చెల్లింపులు జరపాలని కోరారు. కాలువ మూసివేతపై నిర్వహణ, మరమ్మత్తుల అవసరాలపై చర్చించేందుకు ఆ శాఖ ఎస్ఇ సమావేశానికి రాకపోవడంపై తీవ్ర అసంతప్తి వ్యక్తం చేసారు. ఈ సమావేశంలో జెడ్‌పి వైస్ ఛైర్మన్ బుర్రా అనుబాబు, జెడ్‌పి సిఇఒ వివిఎస్.లక్ష్మణరావు, డిప్యూటీ సిఇఒ రామ్ గోపాల్ పాల్గొన్నారు.


సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్


విద్యారంగంలో కాషాయీకరణ తగదు

ప్రజాశక్తి-కాకినాడ

విద్యారంగంలో కాషాయీకరణ విడనాడాలని యుటిఎఫ్ నాయకులు ఐ.ప్రసాదరావు పిలుపు ఇచ్చారు. శుక్రవారం స్థానిక కచేరిపేటలోని యుటిఎఫ్ హోమ్‌లో సంఘం నిర్మాతల్లో ఒకరైన దాచూరి రామిరెడ్డి తొమ్మిదో వర్ధంతి సభ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రామిరెడ్డి చిత్రపటానికి సీనియర్ నాయకులు గోపాలరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రసాదరావు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చే ఎన్‌సిఇఆర్‌టి ముద్రించిన 7వ తరగతి సోషల్ పాఠ్యాంశాల్లో కుంభమేళా, ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనం, చార్‌ధాం యాత్ర గురించి ప్రచురించడం చూస్తే ఒకే మతానికి ప్రాధాన్యత ఇస్తూ లౌకిక విధానానికి తూట్లు పొడిచే పరిస్థితి కనిపిస్తోందని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వం అనే భావనకు ప్రాధాన్యత తగ్గించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారన్నారు. యుటిఎఫ్ కోసం, ఉద్యమ నిర్మాణానికి సుమారు 16 ఏళ్ల ఉపాధ్యాయ సర్వీస్‌ను స్వచ్ఛందంగా వదులుకున్న మహా నాయకుడు రామిరెడ్డి అని తెలిపారు. వివిధ రాష్ట్రాల ఉన్న ఉపాధ్యాయ సంఘాలను ఏకం చేసి, జాతీయ స్థాయిలో ఎస్‌టిఎఫ్ఐ (స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా)ను ఏర్పాటు చేసి, అఖిల భారత స్థాయిలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. యూటిఎఫ్ భవన నిర్మాణాల్లో, డైరీ రూపకల్పనలో, మహా సభలు సమావేశాల నిర్వహణలో, కార్యకర్తలను తయారు చేయడంలో రామిరెడ్డి పాత్ర మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకరవర్మ, గోవిందరాజులు, శ్రీరాములు, జయప్రకాష్, మహేష్ పాల్గొన్నారు.


రామిరెడ్డికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కార్టూ'నిజం'



వేతనాల కోసం తల్లీబిడ్డ డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కాకినాడ కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ మాట్లాడుతూ డ్రైవర్లకు మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని, ఇచ్చే వేతనం కూడా కేవలం రూ.7,800 ఇస్తున్నారని తెలిపారు. అతి తక్కువ వేతనాలు ఇస్తూ నెలలు తరబడి బకాయి పెడితే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే బకాయి జీతాలు చెల్లించే విధంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెలాఖరుతో వీళ్ళ కాంట్రాక్ట్ గడువు ముగుస్తుందని వెంటనే వీరిని ప్రభుత్వం నిర్వహణలోకి తీసుకుని ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి కనీస వేతనం రూ.18,600 చెల్లించాలన్నారు. 9 ఏళ్ల నుంచి ఈ వాహనాలపై విధులు నిర్వహిస్తున్నారని, తెలిపారు. పిఎఫ్ యజమాని వాటా, కార్మికుల వాటా కార్మికుల జీతాల నుంచి రెండువైపులా కట్ చేస్తున్నారని అన్నారు. జిల్లా ప్రెసిడెంట్ ఎఎస్.సాయికుమార్, సెక్రటరీ వి.మల్లికార్జున రావు, ట్రెజరర్ బి.చిన్న బాబు, కుమార్, సుభాష్, ఎం.రమణ, విజయ్, శంకర్, నరేష్, సతీష్, రామకృష్ణ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సిబ్బంది

రెవెన్యూ అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

డివిజన్ పరిధిలో ఉన్న రెవెన్యూ అధికారులకు రెవెన్యూ చట్టాలు, రెవెన్యూ అంశాలపై శుక్రవారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ శ్రీరమణి అధ్యక్షతన అవగాహన కల్పించారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో భాగంగా శుక్రవారం పెద్దాపురం, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, ఏలేశ్వరం మండలాలకు సంబంధించిన తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, విఆర్‌ఒలు, విలేజ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చారు. పెద్దాపురం మండల డిటి కాంతారావు, సర్వేయర్ సామోరు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీరమణి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవి చక్రవర్తి

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-కాకినాడ

యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన కచేరిపేటలోని యుటిఎఫ్ హోమ్‌లో శుక్రవారం నుంచి నుంచి పదో తరగతిలో నూతనంగా ప్రవేశించిన విద్యార్థులకు అవగాహన తరగతులు ప్రారంభించారు. మే రెండో తేదీ నుంచి ఈ నెలాఖరు వరకు ప్రతి రోజూ ఉదయం 8.30 గంటల నుంచి 10.30 వరకూ అనుభవజ్ఞులైన వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు అన్ని సబ్జెక్టుల్లో ప్రాథమిక అవగాహన కల్పిస్తారని యుటిఎఫ్ సీనియర్ నాయకులు ప్రభాకర వర్మ తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి మాట్లాడుతూ పదో తరగతిలో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ జీవితంలో ఏ ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నా ముందుగా పదో తరగతి ఉత్తీర్ణతపైనే ఆధారపడి ఉంటుందని తెలిపారు. నగేష్, వరహాలబాబు, మహేష్, హెచ్‌పి.వర్మ, గోవిందరాజులు, సూరిబాబు, వాసు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని నార్కెడిమిల్లి పాలెం గ్రామం శివారున శుక్రవారం పేకాడుతున్నారన్న విశ్వసనీయ సమాచార మేరకు ఎస్ఐ ఎస్.రాము తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. అయిదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.22,500 నగదును స్వాధీనపరచుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తుని

తుని-గుల్లిపాడు రైల్వేస్టేషన్ల మధ్య పిఎల్.లక్ష్మీపురం రైల్వే ట్రాక్ వద్ద శుక్రవారం రైలు బండి నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినటుట్ల తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. రాజమండ్రి నుంచి విశాఖపట్నం వెళుతున్న రైలు నుంచి 35 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి జారిపడి మరణించాడని తెలిపారు. మృతుని వివరాలు తెలియవలసిందని ఉందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. గాడిమొగ రహదారిలో తిమ్మరాజుపురం జంక్షన్ వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద బైకు పైనుంచి పడి గాయాలైన వైదాడి వీర్రాజు (59) కాకినాడలో జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మరణించాడు. ఈ సెంటర్లో ఉన్న స్పీడ్ బ్రేకర్ వల్ల ఇటీవల పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడ్ బ్రేకర్‌పై జీబ్రా లైన్స్ లేకపోవడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా స్పీడ్ బ్రేకర్‌పై తెలుపు రంగు జీబ్రా లైన్స్ వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పిఎం సభకు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి దుర్మరణం

ప్రజాశక్తి - ఉంగుటూరు

అమరాతి రాజధాని పున:నిర్మాణ సభకు వెళ్లి తిరిగి వస్తుండగా ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో డ్వాక్రా హెచ్‌ఆర్ సీసీ దేవళ్లతిమ్మల్ల నాగరాజు (48) దుర్మరణం చెందారు. బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలంలో డిఆర్‌డిఎలో హెచ్‌ఆర్ సీసీగా నాగరాజు ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నారు. కడప జిల్లాకు చెందిన నాగరాజు ఉద్యోగ రీత్యా మలికిపురంలో భార్య పిల్లలతో ఉంటున్నారు. ఈ క్రమంలో అమరావతిలో మోడీ సభకు జనాలను బస్సుల్లో తరలించేందుకు నాగరాజుకు డ్యూటీ వేశారు. ఈ నేపథ్యంలో 35 మందితో బస్సు శుక్రవారం ఉదయం అమరావతి వెళ్లింది. అయితే ట్రాఫిక్ కారణంగా బస్సును పోలీసులు సభవేదిక సమీపంలోకి రానీయకపోవడంతో బస్సు తిరిగి మలికిపురం బయలు దేరింది. ఈ క్రమంలో ఉంగుటూరు మండలం కైకరం వద్ద టీ కోసం బస్సు ఆగింది. మూత్ర విసర్జన కోసం నాగరాజు రోడ్డు దాటుతుండగా తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపు వెళ్తున్న కోళ్ల లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అపస్మాక స్థితిలోకి వెళ్లిన నాగరాజును హైవే అంబులెన్సులో ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే నాగరాజు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చేబ్రోలు ఎస్ఐ సూర్య భగవాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతికి ఉంగుటూరు వెలుగు ఎపిఎం ప్రభావతి సంతాపం వ్యక్తం చేశారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - పెద్దాపురం

తూర్పు పాకల గ్రామానికి చెందిన వివాహిత అబ్బిరెడ్డి హర్షిత (21) శుక్రవారం ఉరేసుకుని మరణించిందని పోలీసులు తెలిపారు. సిఐ కృష్ణ భగవాన్, ఎస్ఐ వి.మౌనిక సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తామరాడకు చెందిన హర్షిత కుటుంబ సభ్యులు తమ కుమార్తెను అత్తింటి వారే హింసించి చంపేశారని ఆరోపించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మౌనిక తెలిపారు.

భాస్కర రామారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - సామర్లకోట

పెద్దాపురం మాజీ ఎంఎల్ఎ బొడ్డు భాస్కర రామారావు నాలుగో వర్ధంతి సందర్భంగా మఠం సెంటర్లో శుక్రవారం ఆయనకు పలువురు ఘనంగా నివాళి అర్పించారు. నిమ్మకాయల రంగనాగ్, మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, భాస్కర రామారావు చిత్ర పటానికి పూలమాల లేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టిడిపి నాయకులు ఉమా శంకర్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అడబాల కుమార్ స్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, నిమ్మకాయల కిరణ్, గోలి సత్తిరాజు, పలువురు అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మాణ అనుమతులకు వెసులుబాటు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

భవన నిర్మాణాలకు స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి, అనుమతులు పొందే విధంగా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానంలో ఆమోదం పొందిన లేఔట్లు, గ్రామ కంఠం, సర్క్యులేషన్ ప్యాట్రన్ ప్రాంతాల్లో నివాస యోగ్యత కలిగిన ప్రాంతాల్లో పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారుల మార్గ దర్శకాల మేరకు భవన నిర్మాణాలు సులభ రీతిలో చేపట్టుకోవచ్చునని ఆయన తెలిపారు.

పింఛన్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - మండపేట

లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో పెన్షన్లు మంజూరు చేయాలని మండపేట నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. శుక్రవారం మండపేట వైసిపి పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.. వికలాంగులకు రీ-వెరిఫికేషన్ పేరుతో మళ్లీ సర్వే చేయడం వల్ల వారిలో ఆందోళన నెలకొందన్నారు పార్టీలతో సంబంధం లేకుండా నిరుపేదలకు న్యాయంచేయాలని ప్రభుత్వాన్ని తోట డిమాండ్ చేశారు.

బాల్య వివాహాల నివారణ ప్రధాన లక్ష్యం

ప్రజాశక్తి-కాజులూరు, గొల్లప్రోలు

బాల్య వివాహాల నివారణ ప్రధాన లక్ష్యంగా కిశోర బాలిక కార్యక్రమం నిర్వహిస్తునట్టు సెక్టార్ సూపర్వైజర్స్ ఎస్‌బి.మాణిక్యాంబ, కళ్యాణి తెలిపారు. గొల్లపాలెం, పల్లిపాలెంలో శుక్రవారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బాలికల వివాహ నిర్మూలన ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆడపిల్లలు 18 ఏళ్లు నిండిన అనంతరం వివాహాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి జొన్నకూటి సత్య పద్మజ, సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక, రాయుడు వెంకటరమణ, కె.రవి ప్రసాద్, సుబ్బారాయుడు, బచ్చు రామలక్ష్మి, భవాని పాల్గొన్నారు.

గొల్లప్రోలు మండల వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలలో కిశోర వికాసం శిక్షణ తరగతులు నిర్వహించారు. సచివాలయ మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు, విఒఎలు పాల్గొన్నారు.

తాగునీరు అందించేందుకు చర్యలు

ప్రజాశక్తి-కాజులూరు

యుద్ధ ప్రాతిపదికన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపిడిఒ జె.రాంబాబు తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి త్రీఫేస్ విద్యుత్ సరఫరాకు సంబంధించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి త్వరితగతిన తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రస్తుతం పంచాయతీ వద్ద మూడు మోటార్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. స్థానికంగా ఉన్న విద్యుత్ సరఫరా ప్రాంతం నుండి 500 మీటర్ల వరకు విద్యుత్ సరఫరా చేయవలసి ఉందన్నారు.బోర్ వేసిన ప్రాంతానికి విద్యుత్ సరఫరా సంబంధించి ఉన్నత అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు సచివాలయ సిబ్బంది సతీష్, ఉపాధి ఇసి రాజేష్ పాల్గొన్నారు.

కాండ్రకోటలో భాస్కర రామారావు వర్ధంతి

ప్రజాశక్తి-పెద్దాపురం

పెద్దాపురం మాజీ ఎంఎల్ఎ బొడ్డు భాస్కరరామారావు 4వ వర్ధంతి సందర్భంగా కాండ్రకోటలో ఆయన అభిమానులు శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పెద్దాపురం నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో గవరసాన రాజశేఖర్, ఊటా నాగబాబు, పంచాది రామకృష్ణ, రాజబాబు పాల్గొన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారిని శుక్రవారం ఆర్‌డిఒ శ్రీరమణి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం యాత్రికులకు పులిహోర ప్రసాదం వితరణ జరిపారు. శుక్రవారం ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, పూజారి ఐవి.ప్రసాద్ శర్మ, సిబ్బంది ఎస్ రమణ, వరహాలు, శివ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్‌లో శుక్రవారం ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. వేసవి వడగాల్పుల నుంచి ప్రజలు, ప్రయాణికులను ఆదుకునేందుకు ఎస్‌పి బింధు మాధవ్, డిఎస్‌పి శ్రీహరి రాజు, సిఐ కృష్ణ భగవాన్ ఆదేశాలపై సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు తెలిపారు. ట్రాఫిక్ పోలీసుల మజ్జిగ పంపిణీ పట్ల ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఎస్ఐ ఎం.రమేష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గండేపల్లి

వేసవికాలంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, జగ్గంపేట సిఐ శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా మండలంలో ఆటోలపై మైకేల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండి దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలో ప్రజలు వేసవి సెలవుల సందర్భంగా ఇంట్లో ఎవరూ లేకుండా ఊరికికి వెళ్తున్నప్పుడు ఇంట్లో ఎటువంటి విలువైన బంగారు ఆభరణాలూ, నగదు ఉంచరాదని తెలిపారు.

వైసిపి బలోపేతానికి కృషి : గిరి

ప్రజాశక్తి-కిర్లంపూడి

నియోజకవర్గంలో వైసిపి బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పని చేద్దామని వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనుబంధాల సంఘాల అధ్యక్షులను నియమించారని, నియమితులైన పార్టీ నాయకులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టాలని ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. పార్టీలో కష్టపడే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేయాలన్నారు.

హాస్టల్స్‌లో మలేరియా అధికారి తనిఖీలు

ప్రజాశక్తి -తాళ్లరేవు

మండలంలోని కోరంగిలోని ప్రభుత్వ బాలుర, బాలికల వసతి గృహాలను జిల్లా మలేరియా అధికారి డాక్టర్ విల్సన్ శుక్రవారం తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి పారిశుధ్యంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాడిమొగ పిహెచ్‌సి వైద్యాధికారి ఈశ్వర్, ఎంపిహెచ్ఒ బొడ్డు కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ రంజన్, హెల్త్ అసిస్టెంట్లు ఆంజనేయులు, గోవిందు, త్రిమూర్తులు, ఎఎన్ఎం వసంత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆదిత్యలో యూత్ రెడ్ క్రాస్ శిబిరం

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారిచే యూత్ రెడ్ క్రాస్ శిక్షణా శిబిరం నిర్వహించినట్టు కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల రాష్ట్ర స్థాయి సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సదస్సులో రాష్ట్ర నలుమూలల నుండి యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు పాల్గొన్నారు. హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ విధమైన సదస్సులు భావ వినిమయానికి దోహదపడతాయని అన్నారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ సదస్సులో పాల్గొనే వాలంటీర్లకు కెరీర్ గైడెన్స్ కమ్యూనికేషన్స్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కో ఆర్డినేటర్ బి వి ఎస్ కుమార్, రెడ్ క్రాస్ సెక్రెటరీ కె.శివకుమార్, కోశాధికారి పి.రామచంద్ర రాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరాసర ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.కరుణ, నోడల్ ఆఫీసర్ తేజేశ్వరరావు, కో ఆర్డినేటర్లు ఎస్.దుర్గా దేవి, ఎస్.సత్యనారాయణ, ఎస్.మల్లేశ్వరరావు, వి.చిరంజీవి, వి.నాగరాజు వాలంటీర్లు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి భారీగా పన్నుల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరిలోగా పన్నులు చెల్లించే వారికి ప్రభుత్వం 5 శాతం పన్నుల రాయితీ కల్పించిన నేపథ్యంలో పెద్దాపురం పట్టణ పరిధిలో రూ.కోటీ 95 లక్షల 30 వేల మొత్తం పన్నులు వసూలయ్యాయని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి తెలిపారు. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో రూ.7 కోట్ల 25 లక్షలు ఇంటి, ఖాళీ స్థలం పన్నులు డిమాండ్ ఉందన్నారు. వీటిలో ఇప్పుడు 24.8 శాతం పన్నులు వసూలయ్యాయన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.1,64,000 అదనంగా వసూలయ్యిందన్నారు.

ఘనంగా బీచ్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ ప్రారంభం


ఛాంపియన్‌షిప్ ప్రారంభంలో పాల్గొన్న కలెక్టర్, ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సూర్యాపేట వద్ద ఉన్న ఎన్‌టిఆర్ బీచ్‌లో నిర్వహిస్తున్న 12వ అంతర జిల్లాల రాష్ట్ర బీచ్ కబడ్డీ ఛాంపియన్‌షిప్-2025 ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ కమిషనర్ భావన, కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ, ఎపి కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంఎల్ఎ పంతం నానాజీ అధ్యక్షతన జరిగిన సభా కార్యక్రమంలో తొలుత జ్యోతి ప్రజ్వలన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. 12వ అంతర జిల్లాల రాష్ట్ర బీచ్ కబడ్డీ ఛాంపియన్షిప్-2025 క్రీడలను ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 12వ అంతర జిల్లాల రాష్ట్ర బీచ్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడ సముద్రతీరంలో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. తాను కాకినాడ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి రోజుల్లో బీచ్ సందర్శనకు వచ్చినప్పుడు ఈ ప్రదేశం అంతా అపరశుభ్రంగా ఉండేదన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు రాష్ట్రంలో ఇతర ప్రాంతాల నుంచి నిత్యం కాకినాడ సముద్ర తీర ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు వస్తూ ఉంటారని, ఈ ప్రాంతాన్ని సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ఉద్దేశంతో మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో గత నాలుగు నెలలుగా శ్రమించి బీచ్‌ను అందంగా తీర్చిదిద్దామని తెలిపారు. రానున్న 3 నెలల్లో సుమారు రూ.2.5 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఈ సముద్ర తీరంలో చేపట్టినట్టు తెలిపారు. పర్యాటకులకు కనీస అవసరాలైన మరుగుదొడ్లు తాగునీరు, లైట్లు, బెంచీలు వంటివి ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎంఎల్ఎ పంతం నానాజీ మాట్లాడుతూ కాకినాడ బీచ్‌లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో గతంలో బీచ్ ఫెస్టివల్ జరిగేవని, కాని కోవిడ్, ఇతర కారణాలతో కొంతకాలంగా బీచ్ ఫెస్టివల్స్ నిర్వహించడం లేదన్నారు. మరలా ఇప్పుడు 12వ అంతర జిల్లా రాష్ట్ర బీచ్ కబడ్డీ ఛాంపియన్షిప్ నిర్వహించుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13 జిల్లాల నుంచి సుమారుగా 150 మంది క్రీడాకారులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారని ఎమ్మెల్యే పంతం తెలిపారు.

అమరావతి సభకు తరలిన ప్రజలు

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట, తాళ్లరేవు

పెద్దాపురం నియోజకవర్గం నుంచి అమరావతి రాజధాని పనుల పున్నప్రారంభ సభకు శుక్రవారం పెద్దాపురం నియోజకవర్గం నుండి పది బస్సులలో ప్రజలు తరలి వెళ్లారు. సామర్లకోట మున్సిపాలిటీ, మండల కార్యాలయం, పెద్దాపురం మున్సిపాలిటీ, పెద్దాపురం మండల కార్యాలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకున్న బస్సులు జనంతో బయలుదేరాయి. ఆర్‌డిఒ శ్రీరమణి ఎంపిడిఒలు శ్రీలలిత, హిమమహేశ్వరి, మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకట శ్రీనివాసరావు, నాయకులు నూనె రామారావు, ఎలిశెట్టి నాని, మొయిళ్ల కృష్ణమూర్తి, పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు రంధి సత్యనారాయణ, తూతిక రాజు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, కూటమి నాయకులు ఆధ్వర్యంలో బస్సులను మటన్ సెంటర్ వద్ద ప్రారంభించి పంపించారు. అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ చిన్ని, కంటే బాబు, బలుసు వాసు పాల్గొన్నారు.

తాళ్లరేవు సభకు బయలుదేరిన ప్రైవేటు బస్సులను స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టేకుమూడి లక్ష్మణరావు, వాసంశెట్టి శ్రీనివాస్, అత్తిలి బాబూరావు, దత్తాత్రేయ వర్మ, గంజా సూరిబాబు, నడింపల్లి వినోద్, మోపూరి వెంకటేశ్వరరావు, పిసింగి నాగబాబు, సంగాడి కామేశ్వరరావు, కుడుపూడి దుర్గా ప్రసాద్, గాడి తాతీలు, కాండ్రేగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

యోగా సాధకుడు తేజేశ్వరరావుకు అభినందన

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్, యోగా సాధకుడు టి.తేజేశ్వరరావును కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు అభినందించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రణవ సంకల్పయోగ సమితి పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహా సూర్యవందనం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కార్యక్రమం నిర్వహించారు. తేజేశ్వరరావుకు వరల్డ్ రికార్డ్స్ యూనియన్ ప్రశంసా పత్రాన్ని కాకినాడ కలెక్టర్ షాన్మోహన్ జిల్లా క్రీడా ప్రాంగణంలో అందించారు.

రత్నగిరిపై తాగునీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-శంకవరం

అన్నవరం దేవస్థానంలో యాత్రికుల సౌకర్యార్థం తాగునీటికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ షగిలి దేవస్థానం అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ సత్యదేవుని దర్శనార్థం కొండపైకి వచ్చిన వీరికి దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు ఆలయ లంచనాలతో స్వాగతం పలికారు. అనంతరం షాన్‌మోహన్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పిఆర్‌ఒ కృష్ణారావు, ఎంపిడిఒ ప్రసాద్, తహశీల్దారు తాతారావు, సర్పంచ్ ఎస్.కుమార్ రాజా, పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి ఆలయ అధికారులు పాల్గొన్నారు

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గోపవరం కు చెందిన ఆకుల రామదాసు అనారోగ్యంతో అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రామదాసు వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారుడు. రామదాసు ఇంటి వద్ద లేకపోవడం రెండో రోజు పింఛన్ తీసుకోకపోతే వచ్చే నెల వరకు ఆగవలసి వస్తుందని ఆసుపత్రిలో వైద్య చికిత్స అవసరాలకు పింఛన్ సొమ్ము ఉపయోగపడుతుందన్న ఆలోచనతో శుక్రవారం సచివాలయ సిబ్బంది బడుగు సుమ, ఆకేటి మధు పార్వతి లు కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి రామదాసు కు పింఛన్ సొమ్ము అందజేశారు. పింఛన్ అందించిన సుమ, మధు పార్వతీలకు ఈ సందర్భంగా రామదాసు కృతజ్ఞతలు తెలిపాడు.

ద్రాక్షారామంలో భారీ వర్షం

ప్రజాశక్తి - రామచంద్రపురం

అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న వేళ ద్రాక్షారామంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. అయితే ముమ్మరంగా సాగుతున్న దాళ్వా వరి కోతలు, వ్యవసాయ పనులు వర్షంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మరోవైపు రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం కొన్ని చోట్ల తడిసిపోయింది.

వెల్డింగ్ ఓనర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం లేతు, ఆర్కు వెల్డింగ్ ఓనర్స్ అసోసియేషన్ 38వ వార్షికోత్సవం సందర్భంగా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం అమలాపురం సంఘ భవనములో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. యూనియన్ నూతన అధ్యక్షునిగా రమణాతి రవి ప్రసాద్, యూనియన్ ముఖ్య సలహదారులుగా దంగేటి బుజ్జి, కార్యదర్శిగా సంగాని రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా గెద్దాడ శ్రీనివాసరావు, కండిబోయిన రాము, కట్టా సత్యనారాయణ, వెలిగట్ల సూరిబాబు, గుత్తుల వెంకటేశ్వరరావు, చొల్లంగి నాగేశ్వరరావు, ఎన్నికయ్యారు. కార్యక్రమానికి బివిసి విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

సత్యనారాయణ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గోడి గ్రామంలో గోడి గ్రంథాలయ శాఖలో రికార్డ్ అసిస్టెంట్ గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పడమటి సత్యనారాయణ ను ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు సూర్యనారాయణరాజు , గజపతి వర్మ, ఉద్యోగస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

బాల్య వివాహాల వలన కలిగే దుష్ఫలితాలను ప్రజలకు వివరించి బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సర్పంచ్ ఇసుకపట్ల జయమణి కోరారు.చల్లపల్లిలో శుక్రవారం సర్పంచ్ జయమణి ఆధ్వర్యంలో శిశు సంక్షేమ శాఖ వివిధ శాఖల సమన్వయంతో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో అంగన్ వాడీ టీచర్‌లు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.11 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు.

సమస్య పరిష్కారంపై హర్షం

ప్రజాశక్తి - ఆలమూరు

రబీ ధాన్యం సేకరణ అంశంలో మండలానికి చెందిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. శుక్రవారం ప్రభుత్వం మండలంలోని రైతుల నుంచి 23వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సివిల్ సప్లై శాఖను నిర్దేశించడంతో రైతులు హర్షం చేస్తున్నారు. రైతుల సమస్యను ఆలమూరు మండల పర్యటనకు విచ్చేసిన ఎంఎల్ఎ బండారు సత్యానందరావు దృష్టికి తీసుకుని వెళ్లారు. అమరావతి వెళ్లిన ఆయన అక్కడ మంత్రి అచ్చెన్నాయుడును కలుసుకుని సమస్యను పరిష్కరిం చాలని కోరారు. ఎంఎల్ఎ బండారు కృషితో ప్రభుత్వ అధికా రులు వేగంగా స్పందించారు. సమస్య పరిష్కారానికి ఎంఎల్ ఎ సత్యానందరావుకు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.